స్టేజీ వెనుక వుండి ఇదంతా చూస్తూన్న A2 విహారి సునాదమాల మీదికి A3 పిస్తోలు పేల్చటం తరువాత అతడు మరణించటం అంత చూశాడు. A3 మరణం అతన్ని కదల్చలేదు. అతడికి అప్పచెప్పిన పని మంత్రి మరణించే వరకూ సూపర్‌వైజ్ చేయటం, వాళ్ళిద్దరూ మరణించారా లేదా అని చూసుకోలేదు. తన వంతు బాధ్యతగా వెనుక నుంచి వారిమీదకు కాల్పులు కొనసాగించాడు. అతడి మొదటి బుల్లెట్ వెళ్ళి రాడ్‌కి కట్టిన తాడుకి తగిలింది అది తెగిపోడవయిదూలం అంత ఎత్తు నుంచి నిలువునా స్టేజీ మధ్యకు జారింది.

విహారి ముందు చూసుకోలేదు. ఆకాశంలోంచి నక్షత్రం జారిపడుతున్న తెరని ఆఖరి నిముశంలో చూశాడు. అప్పటికే ఆలస్యమైంది

అతడుగానీ తొయ్యకపోతే అది ఆమె తలమీద పడితే అసలు మొదటి బుల్లెట్ చెవి పక్కగా దూసుకుపోయినప్పుడు అతడికి ఏం జరిగిందో అర్థం కాలేదు, ఆ తరువాత పిస్తోలు శబ్దం వినిపిస్తూంటే సునాదమాల చెయ్యి పట్టుకుని పరుగెత్తాడు. ఈ దూలం పడే సమయానికి వాళ్ళిద్దరూ స్టేజీమధ్య వుండటం, దూలం ఆమెమీద పడకుండా అపబోతు దాని బరువుకి ఆగలేక అతడు జారి పడి పోవడం ఒకేసారి జరిగాయి.

వెల్లకిలా ఆమె ఆమెమీద ఆ తాడు అతడి మీద స్టేజి వెనుక వైపు కట్టిన తాకిడికి దాని మీద దూలం పక్కలో ముక్కలు పడ్డట్లు వరుసగా పడ్డాయి.

మొదట పిస్తోలు చప్పుడు తరువాత A3 పెట్టిన ఆర్తనాదం ఆ పైన స్టేజి కూలిపోవడం వరుసగా జరగటంతో ప్రేక్షకులు భయభ్రాంతులయి గుమ్మం నుంచి ఒక్కసారిగా బయట పడటానికి ప్రయత్నించారు. అక్కడ కుమ్ములాట మొదలయింది

మంత్రిగార్ని రక్షంచే ప్రయత్నంలో పోలీసులు వలయంలో ఏర్పాడ్డారు. పట్టుచీర సగం జారుతూ వుండగా ప్రిన్సిపాల్ కుర్చీ వరుసల మధ్య కూలిపోయింది. జనం ఆవిడ పక్కనుంచి పరుగెడుతున్నారు. అంత హడావుడిలోనూ కర్తవ్యాన్ని మర్చిపోనిది డిప్యూటి చీఫ్ ఒక్కరే. గాంగ్‌లో కనీసం ఒక్కరినయినా పట్టుకుని అనంతానంతస్వామికి ఈ సంఘటనతో సంబంధం వుందని నిరూపించటానికి ఇంతకంటే మంచి అవకాశం రాదు.

విహారికి ఈ గొడవ ఏమీ పట్టలేదు. సునాదమాల మీద బోర్లాపడుకుని కబుర్లు చెప్పటానికి ప్రయత్నించాడు. ఆడియెన్స్‌కి దూలపు తెర అడ్డుగా వుండటంతో స్టేజిమీద ఏం జరుగుతూ వుందో కనపడటం లేదు. దూలపు బరువు తన బరువూ ఆమె మీద పడకుండా రెండు చేతులూ స్టేజిమీద బలంగా ఆన్చి తీరిగ్గా అడిగాడు.

ఏం చదువుతున్నా నన్నారు మీరు?

భూమి రెండుగా చీలి తను లోపలికి ఎందుకు పోలేదా అనిపిస్తూంది సునాదమాలకి. కేవలం జలుబు చేస్తేనే నానా హడావుడి చేసే మనిషికి ఎయిడ్స్ అని తెలిస్తే ఎలా వుంటుంది అలా వుంది. పరాయి మొగవాడు తాకితేనే సర్ఫుతో కడుక్కునే ఆ అమ్మాయికి ఈ స్థితి

మంత్రిగారూ పైగా తనన్ని రక్షిస్తున్నవ్వాడూ అవటంతో అలాగే నోరు పెగల్చుకుని బియస్సీ ..... ఎం. పి. సి అంది.

హారిజాంటల్‌కీ పెర్పెండిక్యులర్‌కీ తేడ ఏమిటి?

ఆమె చప్పున ఆ సమాధానం చెప్పలేకపోయింది.

ఆమె మట్లాడక పోయేసరికి చూడండి పైన అంత బరువుండగా మీ మీద ఇలా బోర్లా పడుకోవటం నాకేదో ఇష్టమయిన చర్యగా భావించకండి ఐ మీన్ ..... బరువు లేకపోతే ఇష్టమా అని మీకు సమాధానం రావొచ్చు. అసలే మీరు చాలా అనుమానం మనిషిలా వున్నారు. ఎవరన్నా వచ్చి లేపే వరకూ మనం ఇలా వుండక తప్పదు. నేనూ మీరూ పేరలల్ మనమీద ఈ దూలం పెర్పెండిక్యులర్ ఇక హారిజంటల్ అంటే నిలువునా మరో దూలం .....

నాకు తెలుసు అంది వూపిరిబిగపట్టి. దూరంగా పిస్తోళ్లు పేలుతున్నాయి వున్నట్టుండి ఆమె కెవ్వున  అరిచింది. దానికి కారణం అతడు లయబద్ధంగా ఊగడం ప్రారంభించాడు మాడమ్ మీరు మళ్ళీ నన్ను అపార్థం చేసుకుంటున్నారు. పైన దూలం మీద ఎవరో పరిగెడుతున్నారు. అంతే తప్ప నేను కాదు కారణం

మాట్లాడే స్టేజి దాటిపోయినట్లు ఆమె కళ్ళప్పగించి చూస్తోంది అసలే పెద్దవయిన కళ్ళు అంత పెద్దవిగా కనిపిస్తున్నాయి. అలా ఆమెని చూస్తుంటే అతడికి మరింత ఎడిపించాలనిపిస్తోంది

..... అన్నట్టు మీకు నాతిచరామి అంటే తెలుసా? చిటికెన వేలితో పట్టుకొని కాలితో కాలిని నొక్కిస్తారు పెళ్ళిల్లో తలనుంచి కాలి వరకూ నీ దానిని అని అర్థం అన్నమాట. అటువంటిది ఇలా వేలు, కాలు కాకుండా వేలినుంచి కాలివరకూ లంకె పడిందంటే ఇది వెయ్యి నాటి చరామీలకు సమానం.

చూడండి బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో వుండి మీరిలా మాట్లడటం భావ్యం కాదు ఎలాగో గొంతు పెగల్చుకుని అంది. అప్పుడు గుర్తొచ్చింది అతడికి తనెవరో చెప్పలేదని సారీ నేను మంత్రిని కాను నా పేరు నికుంజ్ విహారి ఇంత బరువుని బాధ్యతగా మోస్తున్న నేను ఆఖరి పోరాటం అనే నాటకంలో మంత్రి పాత్ర ధరిస్తున్న వాడిని.

సునాదమాల మొహం సిగ్గుతో రోషంతో ఎర్రబడడం కోపంగా ఏదో అనబోతూ వుండగా ఎవరో అరెరె అనటం వినిపించింది. మరొకరు దూపం పైకిలేపారు విహారి కండరాలు పట్టేసిన చేతుల్ని సవరించుకుంటూ మీరు నాకు థాంక్స్ చె ..... అంటూ వుండగానే అతడి భుజం పక్కనుంచి మరో తుపాకిగుండు దూసుకు పోయింది. స్పర్శా సుభాన్వేషితుడైన తను బయట ప్రపంచపు భీభత్సాన్ని తాత్కాలికంగా మర్చిపోయినట్లు గ్రహించి చుట్టూ చూశాడు సునాదమాల అక్కణ్నుంచి ఎప్పుడో పారిపోయింది

చుట్టూ స్టేజీ హడావుడిగా గందరగోళంగా వుంది. దాదాపు అందరూ గుమ్మం దగ్గర తోసుకుంటున్నారు. మైకులో వెకేట్ ది స్టేజ్ అని ఎవరో పిలి ఇ ఆఫీసరు అరుస్తున్నారు. 43

చంపినట్టు డిప్యూటి చీఫ్‌కి తెలిసిపోయింది. అతడిని చంపిన వాడిని పట్టుకోకపోతే ఇక సి.బి.ఐకి ఇంత ప్రయత్నం చేసి ఏ ఆధారమూ దొరకనట్టే.

విహారి ఆలోచనలో వుండగానే కాల్పులు ఆగిపోయాయి ఎప్పుడయితే జనం తగ్గిపోయి తాము గుర్తించబడతామన్న అనుమానం కలిగిందో రామ్‌లాల్ అనుచరులకి సైగచేశాడు. కనుచూపు కదిలే సమయంలో అందరూ అదృశ్యమయ్యారు. ఇప్పుడు జనం గోల తప్ప మరేమీ లేదక్కడ. కానీ డిప్యూటీ కమీషనర్‌కి తెలుసు ప్రమాదం వచ్చినప్పుడు తమతో రాలేని పక్షిని వదిలి మిగతావి వెళ్ళిపోయినట్టు తమ మనిషిని ఒకడిని వదిలేసి వాళ్ళు తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్ళిపోయారని.

ఆ మనిషి గ్రీన్ రూమ్‌లో వున్నాడని

..... హడావుడి చేస్తే అతడు లోపల్నుంచి కాల్పులు సాగించవచ్చు

అనంతానంతస్వామి అతడు ప్రభుత్వం సరఫరా చేసే ఆయుధాలకన్నా అధునాతనమైన ఆయుధాలు వారి దగ్గర వుంటాయి జాగ్రత్తగా హాండిల్ చేయాలి. లేకపోతే మరికొంత ప్రాణనష్టం తప్పదు.

*　　　　　　*　　　　　　*

తన తోటి నటులెవరూ కనపడలేదు విహారికి. స్టేజి అంతా అస్తవ్యస్తంగా వుంది కాళ్ళకి అడ్డంగా వున్న సామానులు తోసుకుంటూ గ్రీన్‌రూమ్‌వైపు వెళ్ళాడు.

పులికన్నా ప్రమాదమయిన మనిషి లోపలున్నాడని తెలీదు ..... అతడు లోపలికి నడవబోతుంటే మెడ దగ్గిర పిస్తోలు ఆన్చి చేతులు పైకెత్తు అన్నాడు A2 విహారిని అడ్డం పెట్టుకుని పోలీసుల్నించి.

విహారి చప్పున వెనుదిరిగాడు. సాధారణంగా అలా జరగదెప్పుడూ? ఎంతటి వాడయినా భయపడతాడు నిజానికి విహారి కూడ భయపడ్డాడు. కాని అతడి చెవులు విన్న మాటలకన్నా సబ్‌కాన్షస్ రియాక్షన్ ఎక్కువ తొందరగా జరగటంతో అతడు వెనుదిరిగాడు. A2 పిస్తోలు పేల్చాడు. మెడ చర్మాన్ని కాల్చుతూ అది పక్కగా దూసుకు పోయింది కాల్చిన ఇనుపకడ్డీని మెడమీద పెట్టినట్టు అనిపించింది

అందులో మరోసారి పిస్టల్ శబ్దం వినిపించింది.

ప్రాణం పోయిందనుకున్నాడు విహారి .

అయితే ఈసారి వచ్చిన శబ్దం శత్రువు పిస్టల్ నుంచి కాదు ..... గుమ్మం దగ్గిర నుంచి ఒకమ్మాయి పిస్టల్‌తో నిలబడి వుంది అక్కడ.

తను కాలర్ సర్దుకుంటూ బయటకు రాబోతుంటే పరమేశ్వరాన్ని కవర్ చేయండి అని హడావుడిగా వెళ్ళిపోయిన అమ్మాయి ఆమె పేల్చిన పిస్టల్ అగంతకుడి చేతికి తగలడం అతడి చేతిలో ఆయుధం జారిపోవటం ఒకేసారి జరిగాయి కానీ అతడు ప్రొఫెషనల్. క్షణంలో సర్దుకుని

అందులోంచి శబ్దం రాలేదు.

అప్పటి వరకూ ప్రేక్షకుడిలా చూస్తున్న విహారి చప్పున తేరుకుని వెనుక నుంచి శత్రువు మీదకు లంఘించాడు. అతడికి కరాటే కాదు కదా బాక్సింగ్ కూడా తెలీదు. మెడ దగ్గర మంట పెడుతున్న గాయంతో కసి రేగింది. అంతే అతడి మనస్తత్వమే అటువంటిది రెచ్చగొడితే శత్రువు ఎంత బలవంతుడు అన్న విషయం కూడా ఆలోచించడు. అదే అతడిని భవిష్యత్తులో చాలా కష్టాల్లో పడేసింది.

వెనుక నుంచి తనని పట్టుకున్న విహారి ఒక్క విదిలింపుతో దూరం చేశాడు A2 ప్రొద్దున లేస్తే ఇటువంటివి అతడికి సర్వసాధారణం విహారి లాంటి వాళ్ళు ఒక లెక్కకాదు. ఆ ఊపుకి విహారి క్రింద పడి అదే ఊపులో పైకి లేచాడు. చిన్నప్పుడు ఆడిన ఫుట్‌బాల్ ఆట గుర్తు వచ్చింది ప్రత్యర్థి మోకాలుని బంతిగా ఎదురుగా తెరచి వున్న ద్వారాన్ని గోలుగా ఊహించుకుని లాగి పెట్టి కొట్టాడు. ఆ కిక్ అవతలి వ్యక్తికి కళ్ళు తిరిగేలా చేసింది. ఏ పోరాటానికయినా ఒక సైన్సు ఉంటుంది గానీ ప్రాణాలకి తెగించి అదే ఆఖరి పోరాటం అనుకున్న దానికి సైన్స్ ఏముంటుంది?

క్రింద పడబోయిన A2 అతి కష్టంమీద నిలదొక్కుకున్నాడు రెండు చేతుల్తో కుర్చీ ఎత్తి విహారి మొహంమ్మీదకు విసిరేడు. అదిగానీ తగిలివుంటే విహారిని ఏ ప్లాస్టిక్ సర్జనూ బాగు చేయలేక పోయేవాడు. కానీ దానికి రక్షణగా ముందే పిస్తోలు పేలింది. వీరి ఘర్షణని ఆధారంగా చేసుకుని ఆ మధ్య సమయంలో గుళ్ళు నింపుకున్న ఆమె ఆయుధాన్ని ఎంత గురిగా ఉపయోగించిందంటే ఆ బుల్లెట్ కుర్చీకి తగిలి అదే వూపులో అతడు వెనక్కి పడిపోయాడు. ఏ మాత్రం గాయం లేకుండా దొరికిపోయాడు. ఒకసారి అతడు పడిపోగానే మిగతా ఆఫీసర్లు బిలబిలమంటూ లోపలికి ప్రవేశించారు.

ఆమె విహారి వైపు చెయ్యి సాచి మీరు చేసిన సాయానికి చాలా థాంక్స్. మామూలు పౌరుల్లో మీలాంటి సివిక్ సెన్స్ వున్న వాళ్ళు అరుదు. బుల్లెట్స్ నింపుకోవటానికి నాకు కావలసిన టైమ్ ప్రాణాలకు తెగించి మీరు అడ్డుపడకపోయి వుంటే ఈ రోజు నా ప్రాణాలు పోయేవే అంది.

విహారి ఆమె వైపు అప్రతిభుడై చూశాడు ఆమె వయసు ఇరవై ఆరుకి కాస్త అటు ఇటుగా వుండొచ్చు. ఆమె పిస్తోలు పట్టుకున్న తీరు ఆమెకున్న కమాండ్‌ని తెలువుతోంది. అయినా అతడు చూస్తున్నది ఆమె భంగిమని కాదు ఆమె మొహాన్ని అందులో అదోలాంటి పర్సనాలిటి వుంది. హుందాతనం వుంది. మామూలుగా చూసేవాళ్ళకి అందం మాత్రం కనిపిస్తుంది. లోతుగా చూడగలిగితే ఆ కళ్ళలో ఒక విధమైన పట్టుదల కసి కనిపిస్తుంది. రాధ కృష్ణుడికి ఒక కోణంలో సత్యభామ గాను మరో కోణంలో రుక్మిణిగాను కనపడి వుంటుంది. అందుకే ఆమె అంటే అంత ప్రేమ ఈ పర్సనాలిటి అనేది చాలా మంది అమ్మాయిలకి వుండదు అందుకే క్యారేషు ..... దాసి స్టేజ్ వరకే వచ్చి అగిపోతారు.

విహారికి కవిత్వం రాదు వస్తే అనుకునే వాడు ముద్దుపల్లని ఈమెని చూసే రాధికా

వ్రాసి వుండవచ్చు ఆమె చెలరేగిన విధానం గాని తిక్కన సోమయాజి కంటబడివుంటే తన నిర్వచనోత్తర రామాయణంలో చెలగి చెలగి మలగి మలగి యల్ల యల్లన క్రాలి క్రాలి బిట్టు తూలి తూలి ..... అని వుంటాడు. ఆమె రివాల్వర్ పట్టుకున్న భంగిమే బాల గంగాధర తిలక్ చేత నా బ్రతుకు కొసల నువ్వు నీ బ్రతుకు మొదల నేను అనిపించి వుంటుంది. ఆమె విగ్రహాన్ని చూస్తే యెల్లండ రఘువారెడ్డి నిమ్మ చెట్టుకు నిచ్చెన్నేస్తే నిమ్మముల్లు రొమ్ము నాటెరోయ్ ఓ రందకాడ అని వ్రాసి వుంటాడు.

విహారి అమ్మాయిల వెంట తిరిగే రకం కాదు. అలా అని పూర్తి ఇంట్రావర్ట్ కాదు. ఒకేరోజు కనబడిన ఇద్దరమ్మాయిలు ఒకరికన్నా ఒకరు వేర్వేరు కోణాల్లో అపురూప సౌందర్య భంగిమల్లో అపురూప సంఘటనల్లో పరిచయమై ఆ యువకుడిని అల్లరిపెట్టారు.

మీ పేరేమిటో తెలుసుకోవచ్చా?

నికుంజ్ విహారి

థాంక్స్ నా పేరు ప్రవల్లిక డిప్యూటి కమీషన్ సి బి ఐ .....

3

ఏమిటే ఈ అర్థరాత్రి పూట స్నానం థియేటర్ నుంచి రాగానే బాత్‌రూమ్‌లో చేరి అరగంటయినా బయటకు రాని సునాదమాలతో బామ్మ బయట్నుంచి అరిచింది ఇటుకపొడి సీకాయ కలిపి రుద్దుతోంది మాల చన్నీళ్ళు మీద పడుతున్నా మంట తగ్గలేదు మాలకి.

మా వాడు నేనూ పందెం వేసుకున్నామండీ మంత్రి వేషంలో మిమ్మల్ని ఫూల్ చేశాడు వెళుతుంటే పద్మాకర్ అన్న మాటలు ..... విహారి మీద పడుకోవటం కన్నా ఈ మాటలు ఎక్కువ అవమానకరంగా వున్నాయి. మరీ తనంత పిడత క్రింద పప్పులా కనపడుతూందా?

సునాదమాల అక్కని పక్కింటి స్టూడెంట్ మోసంచేసి వెళ్ళిపోయాడు విష్ణుని కన్నాక ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది. తండ్రికి గుర్రప్పందేల పిచ్చి వుంది. ఒకరోజు ఇంటి దస్తావేజులు తాకట్టు పెట్టి డబ్బు తీసుకెళ్ళబోయేడు. తల్లి వద్దని బ్రతిమాలింది. ఘర్షణలో తల్లి మరణించింది. తండ్రిని పోలీసులు తీసుకుపోయారు. ఆ తరువాత ఎప్పుడో అతడు జైలునుంచి విడుదలయి ఇంటికి రాకుండా దేశాలు పట్టి పోయాడు. మాల బామ్మ విష్ణు మిగిలారు.